ప్రజలు బేజార్ పాలన బేకార్

- రేవంత్ ఏడాది పాలన ఫెయిల్
- పైన పటారం లోన లొటారం
- నీ పాలన అంతా డంబాచారం
- ఎవరూ మెచ్చుకునే పరిస్థితి లేదు
- అందుకే మాది సుపరిపాలన అని సీఎం సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటాండు
- అబద్ధానికి అంగీ లాగు వేస్తే ముఖ్యమంత్రి రేవంత్
- నీది సుపరిపాలనని ప్రజలు చెప్పాలె
- దమ్ముంటే వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చెయ్యి
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

> నీకు దమ్ముంటే.. రైతుల మీద నీకు నిజంగా ప్రేముంటే.. నీది నిజమైన ప్రజాపాలనే అయితే.. సంపూర్ణ రుణమాఫీ, వరంగల్ డిక్లరేషన్‌ను తు.చ తప్పకుండా అమలు చెయ్యి. అప్పుడు చెయ్యి రైతు పండుగను. అప్పుడు చేసుకో నీ పరిపాలన విజయోత్సవాలు. నీ ఏడాది పాలన అంతా పైన పటారం లోన లొటారం.. అంతా డంబాచారం. – హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన అన్నిరంగాల్లో ఫెయిల్ అయిందని, ఈ సర్కారు ఉత్త బేకార్‌గా ఉన్నదని ప్రజలే అనుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎవరూ మెచ్చుకునే పరిస్థితి లేకనే ముఖ్యమంత్రి తన భుజం తానే తట్టుకుంటున్నారని, తమది సుపరిపాలన అని సెల్ఫ్ డబ్బా కొట్టుకున్నారని ఎద్దేవాచేశారు. 'నీది సుపరిపాలన అని ప్రజలు చెప్పాలె. నువ్వు కాదు రేవంత్‌రెడ్డీ.. నీ అపరిపక్వత, నీ అసమర్థత, నీ ప్రతికూల వైఖరి వల్ల రాష్ట్రంలో నేడు అన్నిరంగాల్లో ప్రతికూల వాతావరణం నెలకొన్నది' అని ఆదివారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. 'మేము మంచి ఆర్థిక వృద్ధితో రాష్ట్రాన్ని అప్పగిస్తే, నీ రాక తర్వాత ఆశించిన మేరకు ఆర్థిక వృద్ధి రేటు పెరగలేదు. వృద్ధి రేటు పెంచే సత్తా నీకు లేదు. సంపద పెంచలేక, ప్రజలకు పంచలేక నోటికొచ్చినట్టు వాగుతున్నవు. నెపం ప్రతిపక్షం మీదికి నెట్టుతున్నవు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు నీ మాట లున్నయి. ఈ ప్రభుత్వానికి ఆదాయం పెంచే సత్తా లేదు. ఇచ్చిన హామీలు అమలు చేసే చిత్తశుద్ధి లేదు. ప్రజలకు వాస్తవం చెప్పే దమ్ము లేదు. కాంగ్రెస్ పాలన ఎట్లున్నదంటే.. ముందు దగా, వెనుక దగా, కుడి ఎడమల దగా దగా' అంటూ నిప్పులు చెరిగారు.

> ఏడు లక్షల కోట్ల అప్పు అని ఏడాది నుంచి చెప్పిన అబద్ధమే మళ్లీ మళ్లీ చెప్తున్నవ్. గత ప్రభుత్వం దాచిపెట్టిందని అసత్య ప్రచారం చేస్తున్నవ్.. ప్రభుత్వం అట్ల దాచే అవకాశమే ఉండదు రేవంత్‌రెడ్డీ.. అప్పులు బహిరంగ రహస్యమే. గణాంకాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉంటయి. ఏటా అసెంబ్లీలో ప్రవేశపెట్టే కాగ్ నివేదికల్లో ఉంటయి. ఆనాడు సీఎల్పీ లీడర్‌గా ఉన్న భట్టి విక్రమార్కకు రాష్ట్ర అప్పులు ఎంతో? ఆదాయం ఎంతో తెలియదా? –హరీశ్‌రావు

గోబెల్స్‌ను మించిన రేబెల్స్ ప్రచారం

ఏడు లక్షల కోట్ల అప్పు అని ఏడాది నుంచి చెప్పిన అబద్ధమే రేవంత్‌రెడ్డి చెప్తున్నాడని, గోబెల్స్‌ను మించిన రేబెల్స్ ప్రచారం చేస్తున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. అప్పులు బహిరంగ రహస్యమేనని, గణాంకాలన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉంటాయని, అసెంబ్లీలో ఏటా ప్రవేశపెట్టే కాగ్ నివేదికల్లో ఉంటాయని చెప్పారు. ఆనాడు సీఎల్పీ లీడర్‌గా ఉన్న భట్టి విక్రమార్కకు రాష్ట్ర అప్పులు, ఆదాయం తెలియదా అని నిలదీశారు. తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న మొత్తం అప్పు 4,26,499 కోట్లు అని, దీనిపై చర్చించేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏ చానల్ వేదికగా కూర్చుందామో, ఏ ఆర్థిక నిపుణులతో కూర్చుందామో చెప్పాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు.

నీ పేరే ఎగవేతల రేవంత్‌రెడ్డి!

అబద్ధానికి అంగీ లాగు వేస్తే అచ్చం రేవంత్‌రెడ్డి లెక్కనే ఉంటదని ప్రజలు అనుకుంటున్నారని హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. 'మీ పేరే ఎగవేతల రేవంత్‌రెడ్డి. రైతు బంధును ఎవరు ఎగ్గొట్టారో ప్రజలకు తెల్వదా? ప్రజల విజ్ఞత మీద నీకు చాలా తక్కువ అభిప్రాయం ఉన్నది. మోసం చేసుడు నీకు అలవాటు, మోస పోవుడు ప్రజలకు అలవాటు అనే కదా నీ నమ్మకం. 'ఎన్నికలకు ముందు రైతు బంధు కోసం 7,200 కోట్ల నిధులు సిద్ధం చేసి రైతుల ఖాతాల్లో వేసేందుకు ఎన్నికల కమిషన్ పర్మిషన్ తీసుకుంటే.. రైతుల నోటికాడికి వచ్చిన బుక్కను ఎత్తగొట్టిన పాపాత్ముడివి నువ్వు.. ఇప్పుడైతే 10 వేలు, మేమొస్తే 15 వేలు అని రైతులను నమ్మించి ఓట్లు కొల్లగొట్టిన ఘరానా మోసగాడివి నువ్వు. పార్లమెంట్ ఎన్నికల ముందు మేము నిలదీస్తే విధిలేక మేము సిద్ధం చేసిన నిధులతో రైతుల ఖాతాల్లో 5 వేలే వేసినవు. 7500 ఎందుకు వేయలేదు? నిజాయతీ ఉంటే సమాధానం చెప్పు. మొన్న వానకాలం పూర్తిగ ఎగ్గొట్టినవు. రైతుబంధు ఆపిందినువ్వు.. లేని ఆశలు రేపింది నువ్వు.. తీరా అధికారంలోకి వచ్చి ఎగ్గొట్టింది నువ్వు' అంటూ హరీశ్ నిప్పులు చెరిగారు.

> మా హయాంలో మొత్తం 11 విడతల్లో 72,815 కోట్ల రైతుబంధు ఇచ్చిన రైతు బాంధవుడు కేసీఆర్. ఆరు నూరైనా రైతుబంధు ఆపని కేసీఆర్ ఎక్కడ? ఏడాదిలోనే చేతులెత్తేసిన నువ్వెక్కడ? కేసీఆర్ పేరు ఉచ్చరించే నైతికత కూడా నీకు లేదు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం 7,200 కోట్లు సిద్ధం చేసి ఖాతాల్లో వేసేందుకు ఎన్నికల కమిషన్ పర్మిషన్ తీసుకున్నం. రైతుల ఖాతాల్లో రైతుబంధు పడితే నీ డబ్బాలో ఎక్కడ ఓట్లు పడవోనన్న భయంతో దుర్మార్గంగా ఈసీకి ఫిర్యాదు చేసి ఆపింది నువ్వు. –హరీశ్‌రావు

> తెలంగాణ ప్రభుత్వానికి ఉన్న మొత్తం అప్పు 4,26,499 కోట్లు అని అసెంబ్లీ వేదికగా లెక్కలతో సహా నిరూపించిన.ఇప్పటికీ అదే సవాల్ చేస్తున్న. నా వాదనలో సత్యం ఉన్నది. సత్యాన్ని ఎదుర్కొనే శక్తి నీకు, నీ ఆర్థిక మంత్రికి లేదు. తోచిన అబద్ధమల్లా చెప్పి ప్రజలను తొవ్వ తప్పిద్దామనే తొండి బుద్ధి మీది. ఏ చానల్ వేదికగా కూర్చుందామో, ఏ ఆర్థిక నిపుణులతో కూర్చుందామో? చెప్పు. తప్పించుకోకు. –హరీశ్‌రావు

కరోనా కాలంలోనూ రైతుబంధు ఆగలే

నాడు బీఆర్ఎస్ పాలనలో వరుసగా రెండేండ్లు కొవిడ్ మహమ్మారితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైనా కేసీఆర్ రైతు బంధును ఒక్కసారి కూడా ఆపలేదని హరీశ్‌రావు గుర్తుచేశారు. మొత్తం 11 విడతల్లో రూ.72,815 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన రైతు బాంధవుడు కేసీఆర్ అని కొనియాడారు. 'ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతు బంధును ఆపిన విషయం, అధికారంలోకి వస్తే 15 వేలు ఇస్తామని చెప్పిన విషయం నీకు గుర్తులేకపోవచ్చు రేవంత్‌రెడ్డీ.. ఆ ఫిర్యాదు కాపీ, ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మీరు మాట్లాడిన వీడియోను పంపుతున్నా చూడండి' అని చురకలంటించారు.

ముళుగు జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్

- కీలక నేత సహా ఏడుగురు మావోయిస్టుల మృతి
- నలుగురు మృతుల గుర్తింపు: ముళుగు ఎస్పీ శబరీశ్

ఏటూరునాగారం, డిసెంబర్ 1: ముళుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక–ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకర పోరు కొనసాగింది. ఇరువర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సమీప గ్రామాల ప్రజలు చెప్తున్నారు. చెల్పాక పంచాయతీ పరిధిలోని పోలుకమ్మ వాగు గొత్తికోయగూడేనికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం పుల్లలమెద తోగు సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. మృతుల్లో నర్సంపేట–ఇల్లందు ఏరియా దళ కమాండర్ కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), డివిజన్ కమిటీ సభ్యుడు ఏగోలోపు మల్లయ్య అలియాస్ కోటి (43), ఏరియా కమిటీ సభ్యురాలు ముసకి జమున (23), ఏరియా కమిటీ సభ్యుడు కరుణాకర్ (22) ఉన్నట్టు ముళుగు జిల్లా ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. పీఎల్‌జీఏ వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ దెబ్బ కోలుకోలేని దెబ్బతగిలింది.

ఏడుగురి మృతి: ఎస్పీ

పోలీసులు చెల్పాక ప్రాంతంలో పోలీసుల పెట్రోలింగ్ చేస్తుండగా, ఉదయం 10 నుంచి 12 మంది మావోయిస్టులు కనిపించారని, పోలీసులను చూసి వారు కాల్పులు జరిపారని జిల్లా ఎస్పీ శబరీశ్ వివరించారు. అరగంట పాటు కాల్పులు జరిగాయని, తర్వాత ఘటనా స్థలంలో పరిశీలించగా ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు గుర్తించామని తెలిపారు. మరికొందరు తప్పించుకుని పారిపోయినట్టు తెలిపారు. తప్పించుకున్న వారు సరెండర్ కావాలని ఆయన కోరారు. ఘటనా స్థలంలో రెండు ఏకే 47, ఒక జీ–3, ఒక 303, ఒక సింగిల్ షాట్, ఒక తపంచా ఉన్నట్టు తెలిపారు. కిట్ బ్యాగులు, సాహిత్యం, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య

కొత్తగూడెం క్లైం, డిసెంబర్ 1: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ యువకుడిని హత్యచేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. బీజాపూర్ జిల్లా బైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దాలేకు చెందిన కామేశ్ కుంజమ్ (25)ను శనివారం రాత్రి సాయుధులుగా వచ్చిన మావోయిస్టులు అపహరించుకెళ్లారు. తర్వాత సదరు యువకుడిని హత్య చేసి, టిండోడి మార్గంలో మృతదేహాన్ని వదిలివెళ్లారు. 'పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతోనే కా మేశ్‌ని హత్య చేశాం' అంటూ మావోయిస్టు పార్టీ బైరామ్‌గఢ్ ఏరియా కమిటీ పేరుతో ఘ టనా స్థలంలో లేఖలను విడిచివెళ్లారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న బైరామ్‌గఢ్ పోలీసులు.. కామేశ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషప్రయోగంతో మట్టుబెట్టారు!

పౌరహక్కుల సంఘం

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/హిమాయత్‌నగర్: ఏటూరునాగారంలో ఎన్‌కౌంటర్ జరగలేదని, విషప్రయోగంతో ఏడుగురిని పోలీసులు మట్టుబెట్టారని తెలంగాణ పౌర హక్కుల సంఘం ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటున్న ప్రజాపాలనలో 16 మందిని బూటకపు ఎన్‌కౌంటర్లలో పొట్టనపెట్టుకున్నారని ఆరోపించింది. ఈ మేరకు ఆదివారం బహిరంగ లేఖ విడుదల చేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఎన్‌కౌంటర్ జరిగినట్టు లేదని, పోలీసులెవరికీ గాయాలు కాలేదని పేర్కొన్నారు. అన్నంలో విషం పెట్టి, స్పృహ కోల్పోయాక చిత్రహింసలు పెట్టి, తుపాకులతో కాల్చి చంపినట్టుగా అక్కడి గ్రామస్థులు చెప్తున్నారని తెలిపారు. ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని వీరితో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ సైతం ప్రకనటలో డిమాండ్ చేశారు. కార్పొరేట్ల కమీషన్లకు సీఎం రేవంత్‌రెడ్డి కక్కుర్తి పడుతున్నాడని మావోయిస్టు పార్టీ లేఖలో విమర్శించింది. ఆర్ఎస్ఎస్, బీజేపీల లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.పర్యావరణాన్ని దెబ్బతీసే గనులను, పర్యాటక కేంద్రాలు, ఫార్మాసిటీ, నేవీ రాడార్ వంటి వినాశకర అభివృద్ధిని తీవ్రతరం చేస్తున్నదని మండిపడ్డారు.

ఎన్‌కౌంటర్లతో రాష్ట్రంలో అశాంతి : ఎక్స్ వేదికగా హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలో ఓ వైపు బూటకపు వాగ్దానాలు, మరోవైపు బూటకపు ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఏడాది పాలన విజయోత్సవాలు నిర్వహించే ఈ తరుణంలో ఈ బూటకపు ఎన్‌కౌంటర్ ఏంటి? అని ప్రశ్నించారు. అరెస్టులు, నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు ఒకవైపు, బూటకపు ఎన్‌కౌంటర్లు మరోవైపు రాష్ట్రంలో అశాంతిని రేపుతున్నాయని ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. అన్నివర్గాలను మోసం చేసి ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని విమర్శించారు. ఏడో గ్యారెంటీగా డబ్బా కొట్టిన ప్రజాస్వామ్య పాలనకు సైతం విజయవంతంగా తూట్లు పొడిచారని ఫైరయ్యారు.

మాఫీ కథ ముగిసింది!

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నాయి.మొన్నటివరకు రూ.2 లక్షలకుపైగా రుణాలున్న రైతులు ఆపై మొత్తాన్ని బ్యాంకుల్లో చెల్లిస్తే రూ.2 లక్షలు వారి ఖాతాల్లో వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు చెప్పేవారు. కానీ, ఆదివారం సీఎం రేవంత్ ఈ విషయం చెప్పకపోవడం గమనార్హం. దీంతో రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టినట్టేననే సంకేతాలు జారీ చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

బడ్జెట్‌లో కేటాయించింది రూ.26 వేల కోట్లు

మాఫీ చేసింది	రూ.20,616 కోట్లు
ఇంకా మిగిలింది	రూ.5,384 కోట్లు
చేయాల్సిన రుణమాఫీ	రూ.10,384 కోట్లు

బడ్జెట్‌కంటే అదనంగా కావాల్సింది రూ.5 వేల కోట్లు

- సర్కారు లెక్క ప్రకారం రుణమాఫీ అర్హులైన రైతులు 42 లక్షల మంది
- మూడు విడతల్లో 22.22 లక్షల మంది రైతులకు రుణమాఫీ పూర్తి
- నాలుగో విడతలో 3.13 లక్షల మంది రైతులకు మాఫీ
- ఇప్పటివరకు రుణమాఫీ పొందిన మొత్తం రైతులు 25.35 లక్షలు
- ఇంకా రుణమాఫీ కావాల్సిన రైతులు 16.65 లక్షలు
- సీఎం చెప్పిన రేషన్‌కార్డు లేని వారి లెక్క 6.36 లక్షలు
- ఇందులో కుటుంబ నిర్ధారణ చేసింది 4.24 లక్షల మందికి
- ఇప్పుడు రుణమాఫీ చేసింది 3.13 లక్షల మందికే

రుణమాఫీ ఎలా పూర్తయినట్టు?

సర్కారు లెక్కల ప్రకారం 42 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేయాలి. కానీ, ఇప్పటివరకు ప్రభుత్వం నాలుగు విడతల్లో 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఈ లెక్కన ఇంకా 16.65 లక్షల మంది రైతులకు రూ.10,384 కోట్లు రుణమాఫీ చేయాల్సి ఉన్నది. లక్షల మంది రైతులకు రూ.వేల కోట్లు పెండింగ్‌లో ఉండగా రుణమాఫీ పూర్తయినట్టు ఎలా అవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చివరి విడత రుణమాఫీ పూర్తి చేసినట్టు చెప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రుణమాఫీ చేయాల్సింది రూ.31వేల కోట్లు కాగా రూ.20 వేల కోట్లు మాఫీ చేసి.. మొత్తం పూర్తయిందని ప్రకటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

31 వేల కోట్లు కాదు.. అది బ్యాంకుల తప్పు

రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని సీఎంతోపాటు మంత్రులు అనేకసార్లు చెప్పారు. కానీ, సీఎం ఇప్పుడు మాట మార్చేశారు. ఈ మేరకు ఆదివారం మీడియా సమావేశంలో 'రుణమాఫీకి తొలుత రూ.31 వేల కోట్లు అవసరమని చెప్పారు. ఇప్పుడేమో రూ.20 వేల కోట్లు మాఫీ చేసి పూర్తయిందని అంటున్నారు. ఇదెలా సాధ్యం. నిధులెందుకు తగ్గాయి?' అని ఓ విలేకరి ప్రశ్నించగా.. సీఎం స్పందిస్తూ.. 'బ్యాంకర్లు 2014 నుంచి రైతులకు ఉన్న మొత్తం రుణాల వివరాలను కలిపేశారు. రైతు లు తీసుకునే లాంగ్‌టర్మ్ రుణాలను ఇందులో కలిపేశారు. అందుకే వారు ప్రాథమికంగా రూ.31 వేల కోట్లు అని లెక్క చెప్పారు. ఆ తర్వాత మేము నిర్దిష్ట ఫార్మాట్ ఇచ్చాక ఈ లెక్క మారింది' అని సీఎం వివరించారు. తద్వారా రుణమాఫీకి వాస్తవంగా కావాల్సిన రూ.31 వేల కోట్లను 20 వేల కోట్లకు తగ్గించడం గమనార్హం.

అప్పుడే పూర్తయితే నాలుగో విడతెందుకు?

ఆగస్టు 15 నాటికి మూడు విడతల్లో రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రూ.2 లక్షలలోపు రైతులందరికీ రుణమాఫీ పూర్తయినట్టు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు చెప్తూ వచ్చారు. తాము మాట నిలుపుకొన్నాం కాబట్టి మాజీ మంత్రి హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఒకవేళ ఆగస్టు 15 నాటికే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయితే, ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లో నాలుగో విడత రుణమాఫీ ఎందుకు చేసినట్టు? 3.13 లక్షల మంది రైతులకు రూ.2,747 కోట్లు ఎందుకు ఇచ్చినట్టు? ఈ లెక్కన కాంగ్రెస్ మాట తప్పినట్టే కదా?

ఇవీ రుణమాఫీ లెక్కలు

రుణమాఫీ చేయాల్సి మొత్తం **31,000** కోట్లు

మూడు దశల్లో చేసింది **17,869** కోట్లు

నాలుగో దశలో చేసింది **2,747** కోట్లు

ఇప్పటివరకు చేసిన రుణమాఫీ **20,616** కోట్లు

ఇంకా చేయాల్సిన రుణమాఫీ **10,384** కోట్లు

మళ్లీ.. ఆత్మహత్యల తెలంగాణ!

ఏడాదిలోనే ఉమ్మడి రాష్ట్రం నాటి పరిస్థితులు

అప్పులపాలై, సాయం అందక ప్రాణాలు తీసుకున్న రైతులు

ఏడాది బర్బాది

పదేండ్లపాటు నిబ్బరంగా నిలబడిన తెలంగాణ.. మళ్లీ చావులను కండ్ల చూస్తున్నది. దాదాపు దశాబ్దకాలంగా ఆగిన రైతు ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయి. ఊహించని ఉత్పాతంతో ఆటోడ్రైవర్ల జీవితాలు ఆగం కాగా, రైతుబంధు ఆగిపోయి పెట్టుబడి సాయం అందక అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వక చేనేత జీవితాలు చతికిలపడ్డాయి. ఇలా అన్ని వర్గాల్లోనూ ప్రభుత్వ బాధితుల మరణాలు నమోదవుతున్నాయి.

–హైదరాబాద్, (నమస్తే తెలంగాణ):

347 మంది రైతుల ఆత్మహత్య

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 621 మంది అన్నదాతలు మరణించారు. ఇందులో 347 మంది ఆత్మహత్య చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇవన్నీ రాష్ట్రంలోని ప్రధాన పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా లెక్కించినవే. రైతులకు ప్రభుత్వం ఇస్తానన్న 'రైతు భరోసా' ఇవ్వకపోగా, గతంలో తంచనుగా వచ్చిన రైతుబంధును కూడా ఆపేసింది. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, సగంలోనే ఆపేసింది. ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం కారణంగా అకాల వర్షాలతో అన్నదాతలు నిండా మునుగుతున్నారు. ఫలితంగా సన్న, చిన్నకారు రైతులు ధైర్యం కోల్పోతున్నారు. కాంగ్రెస్ పాలనలో 347 మంది రైతులు మరణించారంటే దాదాపు రోజుకు ఒక రైతు బలవన్మరణానికి పాల్పడుతున్నట్టేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో పొలాలకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్ అందుబాటులో ఉండేది. కానీ ఇప్పుడు అప్రకటిత కోతల నేపథ్యంలో రైతులు రాత్రిపూట కూడా పొలాలకు వెళ్లాల్సి వస్తున్నది. దీంతో కరెంట్‌షాక్ కొట్టి 232 మంది, పాము కాటుతో 17మంది రైతులు మృత్యువాత పడ్డారు.

నేలరాలుతున్న విద్యా కుసుమాలు

తెలంగాణలో విద్యార్థుల మరణాలు కలవరపెడుతున్నాయి. ఏడాదిలో సుమారు 355 మంది విద్యార్థులు చనిపోయారు. వీరిలో గురుకుల పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో చదువుతున్న వారు ఉన్నారు. ఒత్తిడి వాతావరణం, ఆర్థిక ఇబ్బందులు, వేధింపులు వంటి కారణాలతో 325 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో ఐదుగురు, అనుమానాస్పద మృతులు 11 మంది ఉన్నారు. ఇంతజరిగినా ప్రభుత్వం తరపున ఒక సమీక్షగానీ, భరోసాగానీ లేకపోవడం బాధాకరం అని విద్యార్థి సంఘాలనేతలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి లేరు. అడిగేవారు లేకపోవడంతో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం రాజ్యమేలుతున్నది.

ఆగిపోయిన సాంచాల సప్పళ్లు

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్డర్లు లేకపోవడంతో తెలంగాణలో నేతన్నల పరిస్థితి దారుణంగా తయారైంది. సాంచాల చప్పుళ్లు ఆగిపోయాయి. గతంలో ప్రభుత్వం బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంల కోసం ఆర్డర్లు ఇచ్చేది. నేతన్నలు సంబురంగా పనిచేసుకునేది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్డర్లు ఆపేసింది. దీంతో నేతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనులేక ఇంటిల్లిపాది ఆకలితో అలమటించాల్సి వస్తున్నది. ఈ పరిణామాలతో ఏడాదిలో 28 మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే ఏడాదిలో 28 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే వారి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

బిల్లులు రాక.. బతకలేక

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాజీ సర్పంచులకు చెల్లించాల్సిన బిల్లులను నిలిపివేసింది.దీంతో అసలు వసూలుకాక, వడ్డీలు కట్టుకోలేక మాజీ సర్పంచ్‌లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గుండెపోట్లకు గురవుతూ తనువు చాలిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆరుగురు మాజీ సర్పంచ్‌లు మరణించినట్టు చెప్తున్నారు.

బతుకు భారమై చావుకు దగ్గరై

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రవేశపెట్టడంతో జీవనోపాధికి కోల్పోయిన ఆటో డ్రైవర్లు తీవ్రమైన దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు ఆటో తీస్తే డీజిల్ పోను రోజుకు 200 రూపాయలు కూడా గిట్టుబాటయ్యే పరిస్థితులు లేవని విలపిస్తున్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామన్న ప్రభుత్వం ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రకటించింది. ఎలాంటి ఉపశమన ఏర్పాట్లు చేయకపోవడం, పూర్తిగా తమను విస్మరించడంతో.. గత్యంతరం లేక 89 మంది ఆటో డ్రైవర్లు ఉసురు తీసుకున్నారు. ఫిబ్రవరిలోనే 20మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారు.

జిల్లాల వారీగా రైతుల మరణాలు

మెదక్	93	రంగారెడ్డి	23	భూపాలపల్లి	16	భువనగిరి	10
హన్మకొండ	39	ఖమ్మం	22	వికారాబాద్	16	నాగర్‌కర్నూల్	9
ఆదిలాబాద్	38	సిద్దిపేట	21	ములుగు	13	మంచిర్యాల	8
నల్లగొండ	37	కరీంనగర్	20	జగిత్యాల	13	వనపర్తి	7
వరంగల్	28	సిరిసిల్ల	19	సూర్యాపేట	13	పెద్దపల్లి	6
మహబూబాబాద్	25	నిజామాబాద్	19	మహబూబ్‌నగర్	12	ఆసిఫాబాద్	5
గద్వాల	25	జనగామ	17	నిర్మల్	12	నారాయణపేట	3
కామారెడ్డి	24	సంగారెడ్డి	16	కొత్తగూడెం	10	సైబరాబాద్	2

చివరి విడత రుణమాఫీ పూర్తి చేశాం

- 25 లక్షల మంది రైతులకు 20వేల కోట్లు మాఫీ చేశాం
- ఇంతటితో 2 లక్షల లోపు రుణమాఫీ పూర్తయింది
- బ్యాంకుల తప్పిదాల వల్లే పెరిగిన రుణమాఫీ మొత్తం
- సంక్రాంతి తర్వాత రైతుభరోసా జమ చేస్తాం
- మీడియా సమావేశంలో సీఎం

హైదరాబాద్, డిసెంబర్ 1(నమస్తే తెలంగాణ): చివరి విడతగా 3.13 లక్షల మంది రైతులకు రూ.2,747 కోట్ల రుణమాఫీని పూర్తి చేసినట్ట